ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
7
శనివారం 5 అక్టోబరు 2024



వ్యాక్సినేషన్.. విఫలం



క్షయ నివారణకు శిశువులకు పుట్టిన వెంటనే బీసీజీ టీకా వేస్తారు. అయితే పెద్దల్లో కూడా ఈ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రభుత్వం వ్యాక్సినేషన్ చేపట్టింది. నొప్పి.. పుండు.. తదితరాలతో పెద్దలు ఈ టీకా వేయించుకునేందుకు వెనుకంజ వేస్తున్నారు. వీరిని చైతన్యవంతం చేసి నొప్పి, పుండులకు సంబంధించి అవగాహన కల్పించి టీకా వేయించడంలో వైద్యఆరోగ్యశాఖ విఫలమైంది. దీంతో వ్యాక్సినేషన్ లక్ష్యాలకు దూరంగా ఉంది. ఆరు విభాగాలకు చెందిన వారిని ఎంపిక చేసి బీసీజీ టీకా వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. గత ఏడాది మేలో ఈ కార్యక్రమాన్ని వైద్యఆరోగ్యశాఖ ప్రారంభించింది. గుంటూరు, పల్నాడు ఇలా 12 జిల్లాల్లో వ్యాక్సినేషన్ ముమ్మరంగా చేపట్టింది. అయితే వ్యాక్సినేషన్ లక్ష్యాలకు దూరంగా ఉండటంతో గడువును ఈ నెల 20 వరకు ప్రభుత్వం పొడిగించింది.

- ముందుకు సాగని మంచి ప్రయత్నం
- లక్ష్యానికి దూరంగా అడల్ట్ బీసీజీ టీకా
- ఆరు నెలలైనా నేటికీ 45 శాతమే అమలు
- మరో మూడు వారాల్లో ముగియనున్న గడువు

గుంటూరు(మెడికల్), అక్టోబరు 4: ఊపిరితిత్తుల క్షయ నివారణకు పెద్దలకు బీసీజీ వ్యాక్సినేషన్ ఇవ్వాలని గత మేలో వైద్య ఆరోగ్య శాఖ మంచి ప్రయత్నం చేపట్టింది. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు, ధూమపాన ప్రియులు, మధుమేహ రోగులు, గతంలో టీబీ నుంచి కోలుకున్న, 60 ఏళ్ల పైబడిన వృద్ధులు ఇలా... మొత్తం ఆరు విభాగాల్లో లబ్ధిదారులను ఎంపిక చేసింది. తొలి విడతగా రాష్ట్రంలో 12 జిల్లాల్లో 50 లక్షల మందికి బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించింది. మూడు నెలల వ్యవధిలో టీకాల కార్యక్రమం పూర్తి చేయాలని నిర్దేశించింది. మే 16న లాంఛనంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ ప్రారంభించారు. ఐదు నెలలు అవుతున్నా నేటికీ కనీసం 50 శాతం లక్ష్యాలను కూడా చేరలేకపోయారు. పెద్దలకు క్షయ నివారణకు టీకా మందు ఇవ్వాలనే లక్ష్యం మంచిదైనా బీసీజీ వ్యాక్సిన్ ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలపై తగిన అవగాహన కల్పించడంలో ఆరోగ్య శాఖ విఫలమైందనే వాదన వినిపిస్తోంది. టీకా ముగింపు కార్యక్రమానికి ఈ నెల 20వ తేదీ లోపే గడువు ఉంది.



వ్యాక్సినేషన్ తర్వాత చేతిపై ఏర్పడ్డ పుండ్లు (నమూనా చిత్రాలు)

బీసీజీ మచ్చలకు భయపడే ఇలా..

క్షయ వ్యాధి నివారణకు వందేళ్ల కిందటే బ్యాసిల్లస్ కామ్లెట్ గ్యురిన్(బీసీజీ) టీకా మందును ప్రవేశపెట్టారు. శిశువు పుట్టిన వెంటనే ఈ టీకాను వేస్తారు. కాగా 2025 నాటికి రాష్ట్రంలో క్షయ కేసులను బాగా తగ్గించాలనే లక్ష్యంతో పెద్దలకు కూడా బీసీజీ వ్యాక్సినేషన్ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ బృహత్ ప్రయత్నానికి శ్రీకారం చుట్టింది. జిల్లా క్షయ నియంత్రణ శాఖ, జిల్లా ఇమ్యునైజేషన్ శాఖ సంయుక్తంగా బీసీజీ టీకాల కార్యక్రమ నిర్వహణ చేపట్టాయి. క్షేత్రస్థాయిలో టీకాల అమలులో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, టీబీ చాంపియన్లు(టీబీ వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్న వారు) పాల్గొంటున్నారు. ముఖ్యంగా పెద్ద వారిలో బీసీజీ వ్యాక్సినేషన్ చేసినప్పుడు చేతిపై పుండు (స్కార్) ఏర్పడుంది. దీని నుంచి శరీర ద్రవాలు ప్రవిస్తాయి. ఇది కొద్ది రోజుల్లో తగ్గిపోతుంది. టీకా పని చేస్తుంది అని చెప్పేందుకు ఇది చక్కటి సంకేతం. కొందరు మధుమేహ రోగుల్లో ఈ పుండు నాలుగు వారాల పాటు ఇబ్బంది పెడుతోంది. ఈ వ్యవధిలో వారు దైనందిన కార్యక్రమాలు చేసుకోలేకపోతున్నట్లు వాపోతున్నారు. కొందరిలో ఇది మరీ నొప్పిగా మారుతోంది. ఈ విషయంపై లబ్ధిదారులకు తగిన అవగాహన కల్పించడంలో ఆరోగ్య సిబ్బంది విఫలమయ్యారనే వాదన ఉంది. ఈ విషయం ఆలస్యంగా గుర్తించిన ఆరోగ్య సిబ్బంది ప్రస్తుతం కౌన్సెలింగ్ చేసి కొంత మేర అవగాహన కల్పిస్తున్నా, బీసీజీ టీకా వేస్తే చేతికి పుండు పడి ఇబ్బంది పడతామనే ప్రచారం బాగా ప్రబలిపోయింది. ఫలితంగా లబ్ధిదారులు టీకాలు వేయించుకునేందుకు ఆసక్తి చూపడం లేదు.

ఏడు జిల్లాల్లో లక్ష్య సాధన మరీ దూరం...

మూడు నెలల స్పెషల్ డ్రైవ్‌లో 50,420,86 మందికి బీసీజీ టీకాలు ఇవ్వాలని నిర్ణయించగా, సెప్టెంబరు 30వ తేదీ నాటికి 22,624,55 మందికి (45 శాతం) మాత్రమే వ్యాక్సినేషన్ పూర్తి చేశారు. మరో 28 లక్షల మందికి టీకాలు ఇవ్వాల్సి ఉంది. అక్టోబరు 20 వరకు గడువు పొడిగించారు. ఈ స్వల్ప వ్యవధిలో వంద శాతం లక్ష్యం సాధించడం దాదాపు అసాధ్యమే. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో ఏడు జిల్లాలు బాగా వెనుక బడ్డాయి. ఇందులో స్వయంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీసత్యసాయి జిల్లా కూడా ఉండటం విశేషం. పల్నాడు(28 శాతం), గుంటూరు(29 శాతం), విశాఖపట్నం(28 శాతం), కృష్ణా(42 శాతం), నంద్యాల(44 శాతం), విజయనగరం(44 శాతం) జిల్లాలు లక్ష్య సాధనకు దూరంగా ఉన్నాయి.

టీకా వేయించుకోవాల్సిన వారు..

- వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు
- ధూమపాన ప్రియులు
- మధుమేహ రోగులు
- గతంలో టీబీ నుంచి కోలుకున్న వారు
- 60 ఏళ్ల పైబడిన వృద్ధులు



- బదిలీల్లో కార్యదర్శుల పంచాయితీ
- కోరుకున్న పోస్టు రాలేదని ఓ సీనియర్ పంతం
- గ్రేడ్-5 కార్యదర్శులపై సీనియర్ పీఎస్‌ల ఎగదోత
- వారికి పంచాయతీలు కేటాయించడంపై ఆగ్రహం
- బదిలీ ప్రక్రియ నిలిపివేయాలని హైకోర్టులో పిటిషన్
- రిలీవింగ్ ఆర్డర్‌పై సంతకాలు పెట్టకుండా ఆపుతున్న వైనం

జూనియర్లతో.. జగడం

గుంటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుకున్న చోట పోస్టింగ్ రాలేదని పంచా యతీరాజ్‌శాఖలో ఓ సీనియర్ (గ్రేడ్-2) పంచాయతీ కార్యదర్శి పంతం మొత్తం కార్యదర్శుల బదిలీలపై ప్రభావం చూపు తోంది. ఆ కార్యదర్శి అధికారులను ఏమీ చేయలేక ఉరుము ఉరిమి మంగళం మీద పడిన చందంగా గ్రేడ్-5 పంచాయతీ కార్య దర్శులైన జూనియర్లపై పడ్డాడు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని సీనియర్ కార్యదర్శులను ఏకంచేసి జూనియర్లపై యుద్ధం ప్రకటించారు. మొత్తం బదిలీ ప్రక్రియనే ఆపేసేందుకు సీనియర్లందరినీ జూనియర్ల మీదకి ఎగదోశారు. కోర్టులో కేసులు వేయించి, బదిలీ ప్రక్రియను ఆపేసేందుకు ప్రయత్నిస్తున్నారు. కోర్టు నుంచి సానుకూల స్పందన రాకపోయినా రిలీవింగ్ లెటర్లు ఇవ్వకుండా జూనియర్ పంచాయ తీ కార్యదర్శులను సీనియర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్‌కు జిల్లా కార్యదర్శిగా వ్యవహరిస్తున్న ఓ సీనియర్ కార్యదర్శి ఒకరికి కోరు కున్నచోట పోస్టింగ్ రాలేదు. దీంతో అతడు అధికారులపై పంతం పట్టాడు. తనకు కోరు కున్న పోస్టింగ్ ఇవ్వకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించాడు. అయినా పోస్టింగ్ రాకపోవడంతో తానే ఓ సమస్యను సృష్టించాడు. గ్రేడ్- 5 పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీలను కేటాయిస్తూ గత ప్రభుత్వం ఇచ్చిన, ప్రస్తుత ప్రభుత్వం అమలు చేసిన జీవో 11ను తెర మీదకు తెచ్చాడు. ఒక పంచాయతీ- ఒక కార్యదర్శి అన్న విధానానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం మూడు నెలల క్రితమే గ్రేడ్- 5 పంచాయతీ కార్య దర్శులను ఖాళీగా ఉన్న పంచాయతీలకు కేటాయించింది. అప్పుడు ఈ వ్యవహారంపై ఏమీ మాట్లాడని సదరు సీనియర్ పంచాయతీ కార్యదర్శి తాజా బదిలీల సందర్భంగా ఆ అంశాన్ని తెరమీదకు తెచ్చాడు. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు అసలు పంచా యతీ కార్యదర్శులే కాదని, వారి నియామకం చెల్లదని, వారిని పంచాయతీ కార్యద ర్శులుగా కేటాయించకూడదని ప్రచారం చేసి, గ్రేడ్- 1, 2, 3, 4 కార్యదర్శులను కూడగట్టాడు. వారితో కోర్టులో కేసులు వేయించాడు.

పంచాయతీల కేటాయింపు ఇలా..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 1042 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రేడ్- 1 పంచాయతీలు 231, గ్రేడ్- 2 పంచాయతీలు 129, గ్రేడ్- 3 పంచాయతీలు 201, గ్రేడ్ 4 పంచాయతీలు 41 ఉన్నాయి. అవిపోను మిగిలిన పంచాయతీల్లో 154 పంచాయతీలను గ్రేడ్- 4 పంచాయతీలుగా ఇటీవల అప్‌గ్రేడ్ చేశారు. వాటిలో ఇప్పటికీ 114 ఇన్‌చార్జిలైన సీనియర్ పంచాయతీ కార్యదర్శుల కిందనే ఉన్నాయి. కాగా 284 పంచాయతీలను జీవో 11 ప్రకారం గ్రేడ్- 5 పంచాయతీలుగా నోటిఫై చేశారు. వాటిలో మాత్రం గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగులు ఇచ్చారు. దీనిని సవాలు చేస్తూ సీనియర్లతో సదరు సీనియర్ కార్యదర్శి హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో 11ని సవాలు చేశారు. బదిలీలపై స్టే విధించాలని హైకోర్టును కోరారు. అయితే హైకోర్టులో సానుకూల తీర్పు రాలేదు. ఈ క్రమంలో గురువారం ఉద్యోగుల బదిలీలు ప్రారంభమయ్యాయి. ఉద్యోగులకు ప్రస్తుతం పనిచేస్తున్న చోట నుంచి రిలీవింగ్ ఆర్డర్లు కావాలి. దీన్ని ఆసరా చేసుకుని సీనియర్లు వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారు. శుక్రవారం ఉదయానికల్లా హైకోర్టు నుంచి స్టే ఆదేశాలు వస్తాయని చెప్పి జూనియర్లపై సీనియర్లతో ఒత్తిడి చేస్తున్నారు. జూనియర్లకు రిలీవింగ్ ఆర్డర్ ఇవ్వకుండా గురువారం తొక్కి పెట్టారు. కాగా శుక్రవారం హైకోర్టులో కేసు విచారణకు రాగా న్యాయమూర్తి పండుగ సెలవుల తర్వాతకు వాయిదా వేశారు.

- ఎంపీల ప్రశ్నలకు రైల్వే శాఖ సమాధానాలు
- ఎప్పటిలానే మొక్కుబడిగా రైల్వే జీఎంతో సమావేశం
- మచిలీపట్నం- నిజాంపట్నం రైలుమార్గంపై తెన్నేటి ప్రతిపాదన
- పల్నాడు జిల్లాకు కొత్త రైళ్లు, స్టాపేజ్‌లపై ఎంపీ శ్రీకృష్ణదేవరాయల వినతి

పరిశీలిస్తాం.. సాధ్యం కాదు

గుంటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పరిశీలిస్తాం.., సాధ్యం కాదు.., అది రైల్వేబోర్డు పరిధిలో ఉంది.. అనే సమాధానాలతో పార్లమెంట్ సభ్యులతో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సమావేశం మొక్కుబడి తంతుని తలపించింది. శుక్రవారం విజయవాడలోని రైల్వే ఎలక్ట్రికల్ ట్రాక్షన్ సెంటర్‌లో జరిగిన ఈ సమావేశానికి ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్ర శేఖర్, ఎంపీలు లావు శ్రీకృష్ణదేవ రాయలు(నరసరావుపేట), తెన్నేటి కృష్ణప్రసాద్ (బాపట్ల), ఆళ్ల అయోధ్య రామిరెడ్డి(రాజ్యసభ సభ్యుడు) హాజరయ్యారు. వీరిలో కేంద్ర మంత్రి చంద్రశేఖర్ మినహా ముగ్గురు ఎంపీలు సమావేశం అజెండాకు ప్రశ్నలు, ప్రతిపాదనలు ముందుగానే సమర్పించడంతో వాటికి రైల్వే శాఖ సమాధానాలు ఇచ్చింది. ఈ సమావేశం వల్ల గుంటూరు రైల్వే డివిజన్‌కు, ఉమ్మడి జిల్లాకు ఒరిగింది ఏమీ లేదు. ఎంపీలతో రైల్వే జీఎం సమావేశంలో అజెండా నెంబరు.10లో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ సమర్పించిన ప్రశ్నలు, ప్రతిపాదనపై కొంతసేపు చర్చ జరిగింది. మచిలీపట్నం - బాపట్ల వయా నిజాంపట్నం పోర్టు కొత్త రైలు మార్గం గురించి ఎంపీ చేసిన ప్రతిపాదనకు రైల్వే శాఖ సమాధానం ఇస్తూ 45.30 కిలోమీటర్ల పొడవునా ఈ రైలు మార్గం కోసం ఫైనల్ లొకేషన్ సర్వే



సమావేశంలో పాల్గొన్న ఎంపీలు పెమ్మసాని, లావు, తెన్నేటి తదితరులు

మంజూరైందని పేర్కొన్నది. రేపల్లె - బాపట్ల వయా నిజాంపట్నం నూతన రైలు మార్గం సర్వే పూర్తి అయిందని, ఈ ప్రాజెక్టు కోసం రూ.792.33 కోట్లు అవసరమౌతాయని రైల్వేబోర్డుకు నివేదించగా రేట్ ఆఫ్ రిటర్న్స్ అంతగా వచ్చే అవకాశం లేదని తెలిపింది. తెనాలి - రేపల్లె మధ్య రెండో రైలుమార్గం నిర్మించాలని చేసిన ప్రతిపాదనపై రైల్వేవర్గాలు సమాధానం ఇస్తూ ఈ ప్రాజెక్టు కోసం రూ.259.91 కోట్లు అవసరమౌతాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం చొప్పున భరించేలా ప్రతిపాదించగా రైల్వేబోర్డు ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. విజయవాడ - గూడూరు మధ్య నాల్గో రైలుమార్గం నిర్మాణానికి ఫైనల్ లొకేషన్ సర్వే మంజూరైందన్నారు. సికింద్రాబాద్ - తిరుపతి వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కి బాపట్లలో నిలుపుదల కోరగా సాధ్యపడదని సమాధానం ఇచ్చారు. ఇదే విధంగా మరికొన్ని ప్రతిపాదనలకు కూడా రైల్వే అధికారులు సాధ్యం కాదని, ఇప్పటికే బాపట్ల, చీరాలకు రైలు కనెక్టివిటీ బాగా ఉందని సమాధానాలతో సరిపుచ్చారు.

2029 మార్చికి బీబీనగర్ డబ్లింగ్ పూర్తి

అజెండా నెంబరు.12లో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రతిపాదించిన ప్రశ్నలకు రైల్వే అధికారులు సమాధానాలు ఇచ్చారు. గుంటూరు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టుకి సంబంధించి నాలుగు జిల్లాల(గుంటూరు, పల్నాడు, నల్గొండ, యాదాద్రి)లో భూసేకరణ జరుగుతున్నదని, ఈ ప్రాజెక్టుని 2029 మార్చి నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నడికుడి - శ్రీకాళహస్తి నూతన రైలుమార్గంలో కొత్తగా రైళ్లను ప్రవేశపెట్టేందుకు పరిశీలిస్తామన్నారు. పేరేచర్ల నుంచి గన్నవరం/ పెదఅవుటపల్లి వరకు ఎంఎంటీఎస్/వందేభారత్ మెట్రో సర్వీసులను నడపాలని ఎంపీ కోరగా అది రైల్వేబోర్డు పరిధిలో ఉందని చెప్పారు. గతంలో మంజూరు చేసిన మాచర్ల - నల్గొండ రైలుమార్గం సాధ్యపడదన్నారు. పల్నాడు జిల్లాకు కొత్త రైళ్లను నడపాలన్నా, స్టాపేజ్‌లు కల్పించాలన్నా నల్లపాడు - పగిడిపల్లి డబ్లింగ్ పూర్తి కావాలన్నారు. డెమూ, మెమూ బోగీల కొరత తీవ్రంగా ఉందని, ఈ నేపథ్యంలో కొత్తగా డెమూ, మెమూ రైళ్లను ప్రవేశపెట్టలేమన్నారు. మాచర్ల - గద్వాల్ రైలుమార్గం విషయంలో తెలంగాణ ప్రభుత్వం నుంచి స్పందన లేదన్నారు. గుంటూరు - న్యూఢిల్లీ కొత్త రైలు ప్రతిపాదన ఇప్పట్లో సాధ్యం కాదని, నల్లపాడులో పిట్‌లైన్ వినియోగంలోకి వస్తే అప్పుడు పరిశీలిస్తామన్నారు. గుంటూరు - వారణాసి నూతన రైలుని ఐఆర్‌టీటీసీ-2024లో ప్రతిపాదించామని, అయితే మార్గమధ్యలో ఉన్న రైల్వే జోన్లు అభ్యంతరం పెట్టడం వల్ల ఇది నిలిచిపోయిందన్నారు. సింహాద్రి ఎక్స్‌ప్రెస్ నరసరావుపేట వరకు పొడిగింపు సాధ్యపడదన్నారు. అలానే పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కి సత్తెనపల్లిలో నిలుపుదల ఉన్నందున పెదకూరపాడులో హాల్టింగ్ వీలు కాదని చెప్పారు. గుంటూరు - నంద్యాల మధ్య న్యూ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ సాధ్యం కాదన్నారు. విజయవాడ - లింగంపల్లి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కి నడికుడిలో నిలుపుదల కోసం రైల్వేబోర్డుకు నివేదించామన్నారు.

సేతుబంధన్ స్కీమ్‌లో శంకర్‌విలాస్ ఆర్వోబీ

రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి చేసిన ప్రతిపాదనలకు రైల్వే అధికారుల నుంచి మొక్కుబడిగానే సమాధానాలు వచ్చాయి. శంకర్‌విలాస్ నూతన ఆర్వోబీ గురించి వేసిన ప్రశ్నకు సేతబంధన్ స్కీమ్ కింద మంజూరైందని, అయితే ఆర్అండ్‌బీ శాఖ పరంగా జాప్యం జరుగుతుందన్నారు. ఇన్నర్ రింగురోడ్డులో ఆర్వోబీకి సంబంధించి డీపీఆర్ రూపొందించడం జరిగిందని, ప్రతిపాదన రైల్వేబోర్డుకి పంపుతున్నా మన్నారు. శ్యామలానగర్ వద్ద ఆర్వోబీ, సంజీవ య్యనగర్ వద్ద ఆర్వోబీ, నెహ్రూనగర్ ఎల్‌సీ గేటు తొలగించేందుకు ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తున్నా మన్నారు. జిల్లాలోని మరికొన్ని నియోజకవర్గాలతో పాటు కృష్ణా జిల్లాలోనూ ఇన్‌ఫ్రాస్ట్రక్చరల్ పనులను ఎంపీ అయోధ్య రామిరెడ్డి ప్రతిపాదించగా వాటికి రైల్వే అధికారులు సమాధానాలు ఇచ్చారు.

దేవాలయాలకు.. దసరా కానుక

- ఆదాయం లేని వాటికి రెండింతల చేయూత
- ఎన్నికల హామీ నెరవేర్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- డీడీఎన్ పథకం కింద 575 ఆలయాలకు నెలకు రూ.10 వేలు
- అన్ని ఆలయాల్లో పూజలు విశేషంగా జరగాలని ప్రభుత్వ ఉత్తర్వులు



గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 4: ఆదాయం లేకుండా.. దూప దీప నైవేద్యాలకు నోచుకోని ఆలయాలకు కూటమి ప్రభుత్వం దసరా కానుక ప్రకటించింది. అన్ని ఆలయాల్లో పూజలు విశేషంగా జరిగేలా.. పూజారులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం రూ.10 వేలు చొప్పున అందించేందుకు సిద్ధమైంది. ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చినట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలయాలకు చేయూతను రెండింతలు చేస్తూ జీవో 216 జారీ చేశారు. ఈ జీవోతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోని 575 ఆలయాలకు లబ్ధి చేకూరనున్నది. రూ.50 వేల లోపు ఆదాయం కలిగిన ఆలయాలకు అందించే పథకాన్ని ప్రభుత్వం రెండు రెట్లు చేసింది. గత ప్రభుత్వం నెలకు రూ.5000 చెల్లించగా, చంద్రబాబు దానిని రూ.10 వేలకు పెంచారు. దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెలలోనే ఆయా మొత్తాలను ఆలయాలకు విడుదల చేయాలని సీఎం ఆదేశాలు జారీచేశారు. ఆదాయం లేని 6(సీ) దేవాలయాలకు డీడీఎన్(దూప దీప నైవేద్యం) పథకం కింద ప్రతి నెల మూడు జిల్లాల్లోని 575 ఆలయాలకు రూ.10 వేలు చెల్లించనున్నారు. గుంటూరు జిల్లాలో 128 ఆలయాలకు గత ప్రభుత్వంలో రూ.6.40లక్షలు మాత్రమే చెల్లించేవారు. కూటమి ప్రభుత్వం దానిని రూ.12.80లక్షలకు పెంచింది. పల్నాడు జిల్లాలో 202 ఆలయాలకు గత ప్రభుత్వం రూ.10.10లక్షల చెల్లించగా, ఈ ప్రభుత్వం రూ.20.20లక్షలు కేటాయించింది. బాపట్ల జిల్లాలో 245 ఆలయాలకు గత ప్రభుత్వం రూ.12.25 లక్షలు చెల్లించగా, ఈ ప్రభుత్వం రూ.24.50లక్షలు చెల్లిస్తుంది. ఆయా ఆలయాల్లో పూజారికి గత ప్రభుత్వం నెలకు 3000 చెల్లించగా ఈ ప్రభుత్వం 7000కు, పూజా సామగ్రి(పడితరం)కి రూ.2000 చెల్లించగా, ఈ ప్రభుత్వం దానిని రూ.3000కు పెంచింది. ఆదాయ మార్గాలు లేని ఆలయాల్లో కూడా విశేషంగా పూజలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. అందులో భాగంగానే మూడు జిల్లాల్లో 575 ఆలయాలకు డీడీఎన్ పథకం కింద చెల్లించే మొత్తాలను రెండింతలు చేసింది. ఆదాయం లేదని ఏ ఆలయంలో కూడా నిత్య కైంకర్యాలు జరగకుండా ఉండకూడదని, ఆలయాన్ని నమ్ముకుని ఉండే అర్చకులు ఆర్థిక ఇబ్బందులు పడకూడదని డీడీఎన్, గౌరవ వేతనాలను పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.


ఆనందంగా ఉంది



డీడీఎన్ పథకం కింద రూ.10 వేలు పెంచడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ చేయూతతో ఆలయాల్లో నిర్విరామంగా నిత్య పూజలు, కైంకర్యాలు నిర్వహించుకోవచ్చు. ఆదాయం లేని ఆలయాలకు డీడీఎన్ పథకాన్ని వర్తింపజేసి అర్చకుల్లో ఆనందాన్ని నింపారు. ఆదాయం లేకుండా ఉన్న ఆలయాలకు ప్రభుత్వం ఈ విధంగా చేయూత అందించడం సంతోషకరం.

- వేదాంతం రమణకుమార్, కోదండరామస్వామి దేవస్థానం, లేమల్లెపాడు

గుంటూరు : శ్రీదేవి శరవన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రెండో రోజు శుక్రవారం విద్యానగర్‌లోని షీర్డీ సాయిమందిరంలో శ్రీ గాయత్రీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



4 కేటగిరీల్లో ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులు

ఏఎన్‌యూకి ఐఎస్‌వో సర్టిఫికెట్

పెదకాకాని, అక్టోబరు 4: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి ఐఎస్‌వో 9001:2015 సర్టిఫికేషన్ లభించింది. ఈ గుర్తింపుతో విశ్వవిద్యాలయ నిర్వహణ, విద్యా ప్రమాణాలు, మౌలికవసతులు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని తెలియజేస్తుంది. నిరంతరం నాణ్యత పెంపొందించడానికి వర్సిటీ కృషి చేస్తుందనడానికి ఈ సర్టిఫికేషన్ ప్రాధాన్యం కలిగినదని ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గంగాధర్‌రావు శుక్రవారం తెలిపారు. విశ్వవిద్యాలయ కీర్తిప్రతిష్టలు పెంచేందుకు నాణ్యమైన బోధన, పరిశోధన రంగాలను బలోపేతం చేసేందుకు ఇటువంటి గుర్తింపు సంస్థల సహకారం అవసరమన్నారు.

దేశంలో ప్రతిష్టాత్మకంగా భావించే ఎన్ఐఆర్ఎఫ్(నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్) ర్యాంకింగ్స్- 2024లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వివిధ కేటగిరీల్లో మెరిసిన సంగతి తెలిసిందే. వాటికి సంబంధించిన సర్టిఫికెట్లు యూనివర్సిటీకి చేరాయని శుక్రవారం ఇన్‌చార్జి వీసీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఎన్‌యూ గతంతో పోల్చుకుంటే జాతీయ ర్యాంకుల్లో నాలుగు కేటగిరీల్లో టాప్ 100లో నిలవడం గమనార్హమన్నారు. ఓవరాల్ కేటగిరీలో 97వ స్థానాన్ని, యూనివర్సిటీల కేటగిరీలో 59వ ర్యాంకు, స్టేట్ పబ్లిక్ యూనివర్సిటీ కేటగిరీలో 20 ర్యాంకు, యూనివర్సిటీ ఫార్మసీ కళాశాలల విభాగంలో 63వ ర్యాంకును ఏఎన్‌యూ సాధించడం గర్వ కారణమన్నారు. ర్యాంకులకు సంబంధించిన డేటాను సమర్పించిన ర్యాంకుల విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ పి.రవిని వీసీ అభినందించారు. బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల కృషి వల్లే ఈ ర్యాంకులు సాధ్యమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌చార్జి రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, ఐక్యుఏసీ డైరెక్టర్ డాక్టర్ కృష్ణసత్య, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అవార్డులను చూపిస్తున్న వీసీ గంగాధర్‌రావు

మల్లాదిలో కార్డెన్ సెర్చ్.. మారణాయుధాలు స్వాధీనం



స్వాదీనం చేసుకున్న మారణాయుధాలు, ద్విచక్రవాహనాలతో డీఎస్పీ హనుమంతరావు ఇతర పోలీసు అధికారులు

అమరావతి, అక్టోబరు 4: వుండలంలోని మల్లాదిలో సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు పర్యవేక్షణలో శుక్రవారం కార్డెన్ సెర్చ్ జరిగింది. ఇటీవల గ్రామంలో రెండు వర్గాల మధ్య ఘర్షణలు జరగడంతో ముందస్తు శాంతిభద్రతల దృష్ట్యా కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామస్తుల నుంచి నాలుగు ఈటెలు, గొడ్డళ్లు, కొడవళ్లు, గులకరాళ్లు, ధృవీకరణపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మారణాయుధాలు కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకునేలా చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రీడలకు ప్రాధాన్యం

యూటీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల ప్రారంభోత్సవ సభలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు





మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు(విద్య), అక్టోబరు 4: ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రీడలకు ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్)ను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఏపీజేఏసీ చైర్మన్ శివారెడ్డి, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి ఎస్ వెంకటేశ్వర్లు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకల్ని ప్రారంభించారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన యూటీఎఫ్ కార్యకర్తల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఆరోగ్యంగా ఉంటేనే తమ వద్ద చదువుకునే విద్యార్థులు ఆరోగ్యవంతంగా తయారవుతారని, ఫలితంగా భవిష్యత్‌తరం ఉజ్వలంగా ఉంటుందన్నారు. క్రీడల్లో రాణించిన వారు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉంటారని తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ ప్రసంగిస్తూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంతోపాటు ఉపాధ్యాయులు క్రీడల్లో ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. శివారెడ్డి మాట్లాడుతూ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఐక్య ఉద్యమాల ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించుకోవడం అభినందనీయమని అన్నారు. వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ ఆట, పాట, పోరాటాల్ని తమ లక్ష్యంగా చేసుకుని ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యూటీఎఫ్ చేస్తున్న కృషి హర్షణీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ వెంకటేశ్వర్లు, పూర్వ అధ్యక్షుడు జోజయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బీ ఆదిలక్ష్మి, ఎం కళాధర్, రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమకుమారి తదితరులు పాల్గొన్నారు. వివిధ జిల్లాల నుంచి దాదాపు 1500 మంది ఉపాధ్యాయులు పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు వాలీబాల్, జావెలిన్ త్రో, రన్నింగ్, క్రికెట్, టెన్నిస్ తదితర 15 రకాల పోటీలు నిర్వహించారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా వైసీపీ క్లీన్‌స్వీప్ ఖాయం



సమావేశంలో మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి, వేదికపై అంబటి రాంబాబు, మోదుగుల, మాజీ మంత్రి రజని, అప్పిరెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న పార్టీ నేతలు

గుంటూరు, అక్టోబరు 4: 'ఎప్పుడు ఎన్నికలొచ్చినా వైసీపీ సునామీలా దూసుకొచ్చి క్లీన్‌స్వీప్ చేయడం ఖాయమని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడుగా మాజీ మంత్రి అంబటి రాంబాబు, గుంటూరు, పల్నాడు జిల్లాల కో ఆర్డినేటర్‌గా మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిల పదవీ స్వీకారసభ శుక్రవారం గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగింది. సభకు ఆ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు అధ్యక్షత వహించారు. సజ్జల మాట్లాడుతూ మూడున్నర నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వ వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం మోసంతోనే గెలిచిందని విమర్శించారు. గత ఎన్నికల ఫలితాలు వైసీపీకి పెద్ద షాకేనన్నారు. విజయవాడలో జరిగిన బుడమేరు వరదతో అనేక మంది ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. గతంలో మాజీ సీఎం జగన్ తీసుకొచ్చిన వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ నీరుగార్చటంతోనే ప్రభుత్వం సహాయ చర్యల్లో విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, వైసీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని హింసకు పాల్పడుతోందన్నారు. ప్రజల్లో వైసీపీ అధినేత జగన్‌పై అభిమానం మరింత పెరిగిందన్నారు. ఈ దఫా ఎన్నికల్లో ఎంత మంది కట్టకట్టుకుని వచ్చినా వైసీపీ సింగిల్‌గా విజయం సాధించడం ఖాయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలేసి సాకులు చెబుతూ బరితెగించారని విమర్శించారు. ఇన్ని సంక్షేమ పథకాలను అమలు చేసినా జగన్‌కు ప్రజలు ఓట్లు వేయలేదులే అన్నట్లుగా చంద్రబాబు కూడా పథకాల అమలును పక్కన పెట్టినట్లుగా ఉన్నారని విమర్శించారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఒకటి, రెండేళ్ల ముందుగానే జమిలి ఎన్నికలు రావచ్చని.. కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వంలో కార్యకర్తలను నిర్లక్ష్యం చేసిన మాట వాస్తవమేనని, ఇకపై అలా జరగదని, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తకు ఏ ఇబ్బంది వచ్చినా నేతలంతా ముందుంటామని స్పష్టం చేశారు. కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, రాబోయేది మన ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ ప్రజలకు మంచి చేసి కూడా ఓటమి చవిచూశామన్నారు. ప్రభుత్వాన్ని, పార్టీని సమన్వయం చేయటంలో విఫలమవటంతోనే వ్యతిరేక ఫలితాలొచ్చినట్లు తెలిపారు. గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాల్‌రెడ్డిలు కృష్ణార్జునల్లా జిల్లాలో పార్టీని విజయం దిశగా నడిపిస్తారన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు, నాయకులు సమష్టి కృషితో వచ్చే ఎన్నికల్లో పార్టీని క్లీన్ స్వీప్ చేస్తామని స్పష్టం చేశారు. సభలో మాజీ మంత్రులు విడదల రజని, మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, చంద్రగిరి ఏసురత్నం, నేతలు అంబటి మురళీకృష్ణ, జంగా గౌతమ్, నూరిఫాతిమా, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ ప్రజాదర్బార్‌కు భారీగా వినతులు



వినతిపత్రాలు స్వీకరిస్తున్న నారా లోకేశ్

తాడేపల్లి, అక్టోబరు 4: రాష్ట్రవ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి వారికి అన్ని విధాలా అండగా నిలుస్తానని రాష్ట్ర విద్య, ఐటీ, ఆర్‌టీజీయస్ శాఖల మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. ఉండవల్లిలో 40వ రోజు ప్రజాదర్బార్‌కు భారీగా విచ్చేసిన ప్రజలు పలు సమస్యలతో కూడిన అర్జీలు అందించగా అన్నింటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పదవ తరగతి వరకు చదువుకున్న తమ కుమారుడికి ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని తాడేపల్లికి చెందిన సీహెచ్ ఆరోగ్యరావు విజ్ఞప్తి చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తాము కుమారుడి సంపాదనపైనే ఆధారపడి జీవిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కూలిపనులకు వెళలుతున్న తమ కుమారుడికి ఉద్యోగం కల్పించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తున్న తాను ఇటీవల ఓ భవన నిర్మాణ సమయంలో ప్రమాదవశాత్తూ కిందపడి తీవ్రంగా గాయపడ్డానని వైద్య ఖర్చులకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని నూతక్కికి చెందిన కోటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. రోడ్డు ప్రమాదంతో తీవ్రంగా గాయపడిన తనకు శరీరంలో ఎడమ భాగం పని చేయడం లేదని వికలాంగ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరి 14వ వార్డుకు చెందిన బీ హేమకిషన్ విజ్ఞప్తి చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న తనకు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని తాడేపల్లి బ్రహ్మానందపురంకు చెందిన సీహెచ్ ఆగ్నేస్ కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు లోకేశ్ హామీ ఇచ్చారు. పలువురు దివ్యాగుల నుండి కూడా అర్జీలు అందుకుని సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులివే.......

గత ఏడాది విజయవాడ బస్‌స్టేషన్‌లో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ప్లాట్‌ఫాంపై ఉన్న ప్రయాణికులపై బస్సు దూసుకొచ్చిన ఘటనలో తన ఆరు నెలల కుమారుడు మరణించాడని, ఆ మనో వేదనతో ఉద్యోగం కూడా కోల్పోయానని బాపట్ల జిల్లా పంగులూరుకు చెందిన కే యల్లమంద కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ జీవనం కోసం ఉద్యోగం కల్పించడంతోపాటు ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. డీఎస్సీ, ఎస్ఐ, కానిస్టేబుల్ వంటి పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు శిక్షణ కోసం స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలని రంపచోడవరానికి చెందిన డాక్టర్ రాజుకుమార్‌రెడ్డి తెలిపారు. వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వకుండా అసిస్టెంట్ ఇంజనీర్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏలూరు జిల్లా పెదవేగికి చెందిన రాజబోయిన సీతమ్మ మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అన్ని డాక్యుమెంట్లతో విద్యుత్ సరఫరా కోసం దరఖాస్తు చేసి రూ.44 వేలు డీడీ చెల్లించినా పెదవేగి ఏఈ కనెక్షన్‌లు ఇవ్వడంలో తాత్సారం చేస్తున్నారన్నారు. వారసత్వంగా సంక్రమంచిన తమ భూమికి నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేశారని సత్యసాయి జిల్లా నామాల గ్రామానికి చెందిన బుక్కపట్నం రమణమ్మ, మంత్రి లోకేశ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. తమ వద్ద అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్లు ఉన్నాయని బీ ఆదినారాయణ అనే వ్యక్తి పాస్ పుస్తకాలు సృష్టించి తమ భూమిని అన్యాక్రాంతం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు విన్న లోకేశ్ పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

ప్రకాశం బ్యారేజి దిగువకు 18వేల 125 క్యూసెక్కులు

తాడేపల్లి టౌన్, అక్టోబరు 4: ఎగువన ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టు ప్రధాన వాగుల నుండి 34 వేల 905 క్యూసెక్కుల వరద నీరు శుక్రవారం ప్రకాశం బ్యారేజి వద్దకు చేరుతున్నట్టు నీటిపారుదల శాఖ జెఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా 25 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 18వేల 125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. తూర్పు, పశ్చిమ డెల్టా కాలువలకు 16 వేల 780 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

అమరావతిలో 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలు

మంగళగిరి, అక్టోబరు 4: అమరావతి రాజధాని పరిధిలోని మూడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు అనుసంధానంగా 9 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా ఆదేశాలు జారీ చేశారు. అమరావతి రైతులకు సీఆర్డీఏ తిరిగి ఇచ్చే స్థలాల రిజిస్ట్రేషన్లు మాత్రమే ఇక్కడ జరుగుతాయని వెల్లడించారు. ఒక్కో రిజిస్ట్రేషన్ కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌ను డిప్యూటేషన్‌పై నియమించడంతోపాటు ఇద్దరు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మరో ఇద్దరు సబార్డినేట్‌లు ఉంటారని ప్రకటించారు.

49,880 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 42,191 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,880 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 19,029 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8500	16500	334	10000	16000
నెంబరు. 5	9000	13500	నెంబరు. 5	9500	12000
273	10000	12500	273	12500	13200
341	8500	15000	341	10000	16000
4884	--	--	4884	11500	11500
సూపర్ 10	--	--	సూపర్ 10	13500	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18800	తేజ	9500	18600
బ్యాడిగి	9500	16000	బ్యాడిగి	8000	17800
దేవనూరు డీలక్స్	9000	17000	దేవనూరు డీలక్స్	9000	16700
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5500	11500



కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ఆలపాటి, వేదికపై ఎమ్మెల్యేలు ఆనందబాబు, నసీర్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, జడ్పీ చైర్మన్ క్రిస్టీనా తదితరులు

విద్యావంతులు వివేకంతో నిర్ణయం తీసుకోవాలి

● ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి ● కార్యాలయం ప్రారంభం

గుంటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల విద్యావంతులు రాబోయే మండలి ఎన్నికల్లో వివేకంతో నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ అశోక్‌బాబు తెలిపారు. ఎన్డీఏ కూటమి తరపున ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్ తన సతీమణి మాధవితో కలిసి శుక్రవారం గుంటూరులో కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనందబాబు, అశోక్‌బాబు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండే ఆలపాటిని తిరుగులేని మెజారిటీతో గెలిపించాలని కోరారు. సాధారణ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమిని ఆదరించినట్లే, విద్యావంతులైన పట్టభద్రులు మరింత చైతన్యవంతంగా ఆలోచించి కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఆలపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో దుష్ట పరిపాలనకు చరమగీతం పాడి కూటమిని అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి తరపున తనను పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన కూటమి పెద్దలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, పురందేశ్వరి, లోకేశ్‌బాబులకు ధన్యవాదాలు చెప్పారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, కార్పొరేషన్ టీడీపీ ఫ్లోర్‌లీడర్ కోవెలమూడి రవీంద్ర(నాని), టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్‌యాదవ్, రావెల సతీష్‌బాబు, పిడికిటి తిలక్ బాబు, వేములపల్లి శ్రీరాంప్రసాద్, ముత్తినేని రాజేష్, వరప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, మద్దిరాల మ్యాని, లాల్‌వజీర్, చుక్కపల్లి రమేష్, పూర్ణచంద్రరావు, తదితరులు పాల్గొని ఆలపాటికి అభినందనలు తెలిపారు.



సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

రూ.1877 కోట్లకు చేరిన సంగం టర్నోవర్ : నరేంద్ర

రూ. 8.88 కోట్ల నికర లాభం - రైతులకు రూ. 33.64 కోట్ల బోనస్

పొన్నూరుటౌన్(చేబ్రోలు), అక్టోబరు 4: సంగం డెయిరీ ఈ ఏడాది రూ.1877.70 కోట్ల టర్నోవర్‌ను సాధించినట్లు చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. 11వ వార్షిక సర్వసభ్య సమావేశం శుక్రవారం డెయిరీలో జరిగింది. ఈ సందర్భంగా డీవీసీ హాస్పటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ప్రగతి నివేదికను, డెయిరీ ఆదాయ, వ్యయాల తీర్మానాలపై చర్చించి ఆమోదించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ సంగం డెయిరీ టర్నోవర్ పరంగా ఈ ఏడాది 17.21 శాతం పెరుగుదల వృద్ధిని నమోదు చేసిందన్నారు. టర్నోవర్ విషయంలో ఇతర సహకార, కంపెనీల అన్నింటికన్న సంగం ప్రథమ స్థానంలో ఉందని వివరించారు. 17 కోట్ల లీటర్ల సంగం బ్రాండ్ పాలను విక్రయించినట్లు చెప్పారు. పాల విక్రయాల్లో 6.81 శాతం పెరుగుదల, పెరుగు విక్రయాల్లో 15.35 శాతం వృద్ధిని నమోదు చేశామన్నారు. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ వాటిని అధిగమించి లాభాలను సాధించడమే కాకుండా రైతులకు బోనస్ అందించామన్నారు. ప్రభుత్వ సహకారం ఉన్న విశాఖ డెయిరీ నష్టాల బాటలో ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం తిరుమల లడ్డూ కోసం వినియోగించే నెయ్యి కల్తీ వ్యవహారం సర్వత్రా చర్చనీయాంశమైందన్నారు. కానీ సంగం డెయిరీలో కల్తీని నిరోధించేందుకు అత్యాధునిక పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. త్వరలోనే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో శాటిలైట్ సంగం డెయిరీ ప్లాంట్లను ప్రారంభించేందుకు పాలకవర్గ ఆమోదించిందన్నారు. మిర్యాల గూడలో ప్లాంట్‌ను ప్రారంభించి హైదరాబాద్, తెలంగాణ ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించనునట్లు చెప్పారు. ఉభయ గోదావరి జిల్లాలో ఓ ప్రాంతం, వైజాగ్, చిత్తూరు పరిసర ప్రాంతాల్లో సంగం శాటిలైట్ డెయిరీలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే పాల సొసైటీల కమిషన్ పెంపు, నూతన భవనాల నిర్మాణానికి సహకారం వంటి పలు కీలక నిర్ణయాలను తీసుకోనున్నట్లు చెప్పారు. అత్యధికంగా పాలు పోసిన పాల రైతులను సత్కరించారు. ఈ సమావేశంలో ఎండీ పీ గోపాలకృష్ణన్, పాలకవర్గ సభ్యులు, సొసైటీల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

పూడ్చిపెట్టిన మృతదేహానికి శవ పరీక్షలు

కొల్లిపర, అక్టోబరు 4: తెనాలిలో సంచలనం సృష్టించిన సైనైడ్ మర్డర్ కేసులో శుక్రవారం పోలీసులు కొల్లిపర మండలం హనుమాన్‌పాలెంలో శవాన్ని వెలికి తీసి ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్స్ ఆధ్వర్యంలో శవపరీక్షలు నిర్వహించారు. తెనాలి యడ్లలింగయ్య కాలనీలో నివాసం ఉంటున్న కరివరపు మోషే (53) జూన్ 2న మృతి చెందాడు. అతడి స్వగ్రామం కొల్లిపర మండలం తూములూరు శివారు చింతలపాలెం కావడంతో మృతదేహాన్ని హనుమాన్‌పాలెంలో పూడ్చి పెట్టారు. మోషేకు భార్య సైనైడ్ ఇచ్చిందని కుటుంబ సభ్యురాలైన మేకల పుష్ప పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు మోషే ది సాధారణ మరణం కాదని తెలుసుకున్న పోలీసులు హనుమాన్‌పాలెం చేరుకుని పూడ్చి పెట్టిన మృతదేహాన్ని వెలికితీసి గుంటూరులోని ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్ ద్వారా శవపరీక్షల నిర్వహించారు. శవపరీక్ష నిర్వహించిన వారిలో తెనాలి సీఐ రమేష్‌బాబు, సైనైడ్ డీఎస్పీ భార్గవి, తెనాలి తహసీల్దార్ గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

క్రీడలతోనే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం

● ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్



క్రీడాకారుల్ని పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు(విద్య), అక్టోబరు 4 : చదువుతోపాటు విద్యాసంస్థలు ఆటకు సమప్రాధాన్యత ఇవ్వాలని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. బీఆర్ స్టేడియంలో శ్రీచైతన్య విద్యాసంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్ పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ పోటీలు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని నింపుతాయని అన్నారు. సంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం ఈమని దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఇంటర్ గేమ్స్, స్పోర్ట్స్‌లు నగరంలోని బీఆర్ స్టేడియం, ఎన్టీఆర్ స్టేడియం, ఎల్ఈఎం పాఠశాలల్లో జరుతున్నాయని తెలిపారు. పోటీలు ఈనెల 6వ తేదీ వరకు జరుగుతాయని, ఇందులో భాగంగా క్రికెట్, షటిల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, పరుగు పందెం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్, శేఖర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాసర్‌జీ,ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు షరీఫ్, జోనల్ ప్రిన్సిపల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

డ్వామా పీడీగా బాధ్యతలు స్వీకరించిన శంకర్



పీడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న శంకర్

గుంటూరు సిటీ, అక్టోబర్ 4 : గుంటూరు జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా వి.శంకర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా కల్యాణదుర్గంలో డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసిన ఆయనను ప్రభుత్వం డ్వామా పీడీగా నియమించి ఇక్కడకి బదిలీ చేసింది. ఇప్పటివరకు ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పని చేసిన పావులూరి బాలమ్మ ప్రకాశం జిల్లా ప్రజా పరిషత్ ఉప ముఖ్య కార్య నిర్వహణాధికారిగా బదిలీపై వెళ్ళారు. బాధ్యతలు స్వీకరించిన శంకర్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం అమలులో జిల్లాను రాష్ట్రంలో అగ్రగామిగా నిలబెడతానని అన్నారు. అనంతరం ఆయన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజను మర్యాదపూర్వకంగా కలిశారు.

డీఐవోగా డాక్టర్ లక్ష్మానాయక్ నియామకం



డీఐవోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ లక్ష్మానాయక్

గుంటూరు (మెడికల్), అక్టోబ రు 4 : జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీ సర్‌గా జిల్లా కుష్టు వ్యాధి నివారణ విభాగంలో పనిచేసే జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీస ర్ డాక్టర్ భూక్యా లక్ష్మానాయక్‌ను నియమిస్తూ డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి శుక్రవారం ఆదే శాలు జారీ చేశారు. రెగ్యులర్ డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజును ఇటీవల ప్రభుత్వం కాకినాడకు బదిలీ చేసింది. ఖాళీగా ఉన్న ఈ పోస్టులో ఇన్ చార్జ్ డీఐవోగా డాక్టర్ లక్ష్మానాయక్‌ను నియమించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అర్హత కలిగిన పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు అందించేందుకు, జిల్లాలో ఇమ్యునైజేషన్ యాక్టివిటీని మెరుగుపర్చేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

కుష్టు నివారణపై శిక్షణ తరగతులు

జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే 25 మంది వైద్యాధికారులకు క్షయ, కుష్టు వ్యాధుల నివారణపై శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. క్షయ, కుష్టు వ్యాధుల గురించి ఉన్న యాప్స్ అప్లికేషన్లు, వాటిని ఉపయోగించే విధానం గురించి డీఎంహెచ్‌వో డాక్టర్ కే.విజయలక్ష్మి వైద్యాధికారులకు వివరించారు. శనివారం కూడా పీహెచ్‌సీ వైద్యాధికారులకు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుంది. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్, లెప్రసీ, టీబీ నివారణ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డీఐవో డాక్టర్ బీ.లక్ష్మానాయక్, మాస్టర్ ట్రైనర్ డాక్టర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

జేటీసీగా బాధ్యతలు స్వీకరణ

గుంటూరు(తూర్పు), అక్టోబరు 4 : రీజనల్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా ఎన్.శివరామప్రసాదు శుక్రవారం బాధ్యతలు స్వీక రించారు. ఈ సందర్భంగా ఆయనకు డీటీసీ కరీం, ఆర్టీవో గోపాల్, ఇతర రవా ణా సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్ శివరామప్రసాదు మాట్లాడుతూ రీజనల్ పరిధిలో రవాణ శాఖలో ఉన్న సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

వరద బాధితులకు ఆర్థిక చేయూత

గుంటూరు(తూర్పు), అక్టోబరు 4 : తుఫానుతో నష్టపోయిన విజయవాడ సింగ్ నగర్ ప్రాంత ప్రజలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు స్నేహ పరిమళం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం రూ.1,75,000 చెక్కును అందజేశారు. అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ టి రాము, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రాజా సిద్ధార్థ, అధ్యక్షుడు జి ఎస్ఆర్ చౌదరి, కార్యదర్శి త్రిపురమల్లు అశోక్‌కుమార్‌లు మాట్లాడుతూ బాధితుల్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి ఇచ్చిన పిలుపు మేరకు ఈ సాయం అందజేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డి.చౌడేశ్వరరావు, కె.ఉదయశంకర్, ఏ.శివరామకృష్ణ, వెంకటరమణ, వీఎల్ నరసింహారావు ఉన్నారు.



చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న స్నేహ పరిమళం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఆటో మేటిక్ అడ్వాన్స్‌మెంట్ పథకంపై అవగాహన

గుంటూరు, అక్టోబరు 4 : ప్రభుత్వంతో ఉద్యోగ సంఘాలకు కుదిరిన ఒప్పందం ప్రకారం ఆటో మేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీంలో ఇప్పటి వరకు ఉన్న 8/16/24 సంవత్సరాల కాల పరిమితిని 6/12/18/24 సంవత్సరాలుగా మార్పు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించి జీవో ఎంఎస్ నెంబరు 96 ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ జారీ చేసినట్లు రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటే పోస్టులో ఆరు సంవత్సరాల ఇంక్రిమెంట్ సర్వీసు పూర్తి చేసిన ప్రభుత్వోద్యోగులు స్పెషల్ గ్రేడ్ పోస్టు స్కేలు నియామకానికి అర్హులని, ప్రస్తుతం వారికి ఉన్న పే స్కేలుపై నుంచే తదుపరి పే స్కేలుకు అర్హులని తెలిపారు. ప్రమోషన్ లేకుండా పదహారుసంవత్సరాల ఇంక్రిమెంటల్ సర్వీసుకు ఒకటే పోస్టు పూర్తి చేసినప్పుడు నియమించిన స్పెషల్ ప్రమోషన్ పోస్టు స్కేలు ఒకటిను ఏఅండ్‌బీలను రెండు భాగాలుగా విభజించటం జరిగిందని తెలిపారు. ఒకటే పోస్టులో 12 సంవత్సరాల ఇంక్రి మెంటల్ సర్వీసు పూర్తి చేసిన ప్రభుత్వోద్యోగులు స్పెషల్‌ప్రమోషన్ పోస్టు స్కేలు 1- ఏ నియామకానికి అర్హులయ్యారని పేర్కొన్నారు. స్పెషల్ ప్రమోషన్ పోస్టు స్కేలు -1 నియామకానికి కావాల్సిన అర్హతలతో మార్పులేదని, అనగా పదోన్నతి పొందటానికి ఉండాల్సి క్వాలిఫికేషన్స్ , ఎటువంటి క్రమశిక్షణా చర్యలు లేకుండా ఉండేందుకు మొదలైనవని వివరించారు. సర్వీసు మార్పు ప్రకారం పదోన్నతి పొందేందుకు అవకాశం లేని పోస్టులలో ఉన్న ఉద్యోగస్తులు పన్నెండు సంవత్సరాల ఇంక్రిమెంటల్ సర్వీసు ఒకటే పోస్టులో పూర్తి చేసిన సందర్భాల్లో స్పెషల్ అడహక్ ప్రమోషన్ పోస్టు స్కేలు -1 ఏకు నియమించబడతారని వీరయ్య తెలిపారు.

విభిన్న ప్రతిభావంతుల ఉపకరణాల మంజూరుకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య), అక్టోబరు 4 : జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు, వయోవృద్ధులకు ఉపకరణాలు మంజూరు కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సంచాలకు సుచరిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు తెల్లరేషన్ కార్డు, సదరం సర్టిఫికేట్, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం, బోనోఫై/స్టడీ సర్టిఫికెట్(లాప్‌టాప్ కోసం), ఫొటో,ఫోన్ నంబరు వివరాలతో ఈనెల 1 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులకు అర్హత, ఉపకరణాల లభ్యతను బట్టి అందజేస్తామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుంటూరు, అక్టోబరు 4 : ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. కొత్తపేట రంగ బొమ్మ సెంటర్ సమీపంలో శుక్రవారం ఈ ప్రమాదం జరిగింది. జొమోటోలో పని చేస్తున్న ఈశ్వర్‌ని కెటిఎమ్ బండి ఢీకొనడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కేటీఎం బండి నడుపుతున్న వ్యక్తులు మద్యం సేవించినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. క్షతగాత్రులను 108లో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన ప్యాచ్ వర్క్ చేయాలి

● నగరాభివృద్ధిపై సమీక్షించిన డాక్టర్ పెమ్మసాని



కలెక్టర్, కమిషనర్, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్షిస్తున్న కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 4 : నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని రోడ్లకు యుద్ధప్రాతిపదికన ప్యాచ్ వర్క్‌లు చేపట్టాలని, నగరంలో మెరుగైన పారిశుధ్యం కోసం రెండు వారాల టైం లైన్‌తో కృషి చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు లక్ష్మణరావు, ఏసురత్నం, ఎమ్మెల్యేలు రామాంజనేయులు (ప్రత్తిపాడు), నసీర్ అహ్మద్(గుంటూరు తూర్పు)లతో కలిసి నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి, పారిశుధ్య పనులు, ప్రాజెక్టులు, సమస్యల పరిష్కారంపై సమావేశం నిర్వహించారు.

తొలుత కమిషనర్ గుంటూరు నగర విస్తీర్ణం, జనాభా, ఇళ్లు, రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఆదాయ, వ్యయాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ రోడ్ల మరమ్మతులను నగరపాలక సంస్థే పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. నగరంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం నగరంలో కమర్షియల్ వ్యర్థాల సేకరణకు గతంలోని ఏజెన్సీలకు కాల పరిమితి ముగిసినందున నూతనంగా టెండర్స్ పిలవాలన్నారు. కమర్షియల్ ప్రాంతాల్లో ట్విన్ బిన్స్ ఏర్పాటుకు ఐటీసీ నుంచి సహకారం అందిస్తామని తెలిపారని అందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీధి కుక్కల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని తాగునీటి సరఫరాపై త్వరలో సమగ్ర సమీక్ష చేస్తామని, అప్పటి వరకు గోరంట్ల కొండ మీద రిజర్వాయర్ పనులు పెండింగ్‌లో ఉంచిన కాంట్రాక్టర్‌కి బిల్లులు చెల్లించవద్దని తెలిపారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ గుంటూరు నగరంలో జీటీఎస్ లు ఏర్పాటు, ఈ-ఆటోలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా మెరుగైన పారిశుధ్యం సాధ్యమవుతుందన్నారు.

కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ నగరంలో జీఎంసీ, ఆర్ అండ్ బి రోడ్లను ఈ నెల 15 నాటికి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపడతామన్నారు. నగరంలో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే మెరుగైన పర్యవేక్షణకు నియోజకవర్గాల వారీగా సీనియర్ అధికారులను ఎంహెచ్‌ఓలుగా విధులు కేటాయించామన్నారు. తాగునీటి సరఫరాలో అంతరాలను గుర్తించామని, వాటిని త్వరలో క్రమబద్ధీకరణ చేస్తామని తెలిపారు. నగరపాలక సంస్థ ఏబిసి సెంటర్‌లో ప్రతి రోజు 100 వీధి కుక్కలకు కుటుంబ నియంత్రణ చేయడానికి లక్ష్యంగా చేస్తున్నామని అన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గోరంట్ల కొండ మీద తాగునీటి ప్రాజెక్ట్ పనులు వేగంగా చేయాలన్నారు. బ్రాడీపేట 4వ లైన్ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, నూతనంగా రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఖాళీ స్థలాల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లకు ప్యాచ్ వర్క్స్ వెంటనే చేపట్టాలన్నారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ గుంటూరు నగరంలో 14 ఏళ్ల క్రితం విలీనమైన గ్రామాలకు తాగునీటిని అందించలేక పోతున్నామని, తక్షణం తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జీఎంసీ అదనపు కమిషనర్ ఓబులేసు, ఎస్ఈ శ్యాం సుందర్, సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, పబ్లిక్ హెల్త్ ఎస్.ఈ. డి.శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, డి.శ్రీనివాసరావు, ఈఈలు, డీసీపీలు, ఏసీపీలు, ఎంహెచ్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చడం రాజ్యాంగ విరుద్ధం



మీడియాతో మాట్లాడుతున్న దళిత నేతలు

గుంటూరు, అక్టోబరు 4 : దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధం అని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య, ప్రధాన కార్యదర్శి గొటుకుల రాఘవ, కార్యదర్శి దర్శనపు శ్రీనివాస్ తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారికి ఈ అంశంపై వారు శుక్రవారం వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత క్రైస్తవులను షెడ్యూల్ కులాలలో చేరిస్తే దాని పరిణామం దళిత హిందూ సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వారి అభివృద్ధికి ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయ రంగాలలో ఎస్సీలు పూర్తిగా వెనుకబడిపోతారని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన దీర్ఘకాల పోరాట ఫలితం వృధా అవుతుందని తెలిపారు. మతం మార్చుకున్న వారిని ఎస్సీ కుల జాబితా నుంచి తొలిగించాలని, నిజమైన ఎస్సీ కులాల వారికే ప్రయోజనాలు అందేటట్లు చూడాలని వినతిపత్రం అందించారు.

13న గుంటూరులో ఇండియా పోస్ట్ రన్

గుంటూరు(తూర్పు), అక్టోబరు 4 : జాతీయ తపాల వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 13న ఉదయం గుంటూరులో ఇండియా పోస్ట్ రన్ నిర్వహిస్తున్నట్టు గుంటూరు డివిజన్ తపాల సూపరింటెండెంట్ యాయల్లమందయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేకర్ హాజరవుతున్నట్టు తెలిపారు. 3కే, 5కే, 10కే విభాగాల్లో ఈ పరుగు జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు 'ఇండియాపోస్ట్‌రన్ ఏపీ. ఐక్యూ301.కామ్' అనే లింక్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అయా విభాగాల్లో గెలిచిన వారికి 2 లక్షల 40 వేల రూపాయల వరకు నగదు బహుమతి అందజేయనున్నట్టు తెలిపారు.

సీసీఎస్ అదనపు ఎస్పీగా సుప్రజ

గుంటూరు, అక్టోబరు 4 : రాష్ట్రవ్యాప్తంగా పలువురు అదనపు ఎస్పీలు, డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఏసీబీ అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కే.సుప్రజను సీసీఎస్ అదనపు ఎస్పీగా నియమించారు. సుప్రజ గతంలో డీఎస్పీగా, అదనపు ఎస్పీగా జిల్లాలో సుదీర్ఘ కాలం పని చేశారు. గత ఎన్నికలకు ముందు ఆమెను ఏసీబీకి బదిలీ చేశారు. తాజాగా జరిగిన బదిలీల్లో ఆమెను తిరిగి గుంటూరు సీసీఎస్ అదనపు ఎస్పీగా నియమించారు.

తుళ్లూరు డీఎస్పీగా మురళీకృష్ణ

తుళ్లూరు డీఎస్పీగా తక్కెళ్లపాటి మురళీకృష్ణను నియమిస్తూ శుక్రవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు ప్రస్తుతం ఆయన రేపల్లె డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు.

బహురూప అంబికకు జేజేలు



అరండల్‌పేట అష్టలక్ష్మీ ఆలయంలో శ్రీ గాయత్రీమాతగా అమ్మవారు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 4: శ్రీదేవి శరవన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజున శుక్రవారం అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు, అలంకరణలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గో పూజ, సువాసిని, కుమారి పూజలు సువాసినులచే సామూహిక కుంకుమార్చనలు జరిగాయి. పలు దేవాలయాల్లో అమ్మవారిని అన్నపూర్ణదేవి, గాయత్రి దేవి, లలితా పరమేశ్వరీ, మీనాక్షి దేవిగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు అందుకున్నారు. పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



బృందావన్‌గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణదేవిగా అమ్మవారు



సీఎం సహాయ నిధికి రూ.27.5 లక్షల విరాళం సీఎం చంద్రబాబుకు అందజేసిన సీనియర్ సిటిజన్స్ సర్వీస్ ఆర్గనైజేషన్ నేతలు (ఆంధ్రజ్యోతి-గుంటూరు)

సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఓటరు దరఖాస్తు ఫారాలు

గుంటూరు, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మార్చి నెలలో జరిగే కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల ఓటరు దరఖాస్తు ఫారాలు గుంటూరులోని బృందావన్ గార్డెన్స్ ఐదోలైనులోని సీనియర్ సిటిజన్స్ సర్వీస్ అసోసియేషన్ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని సంస్థ అధ్యక్షుడు మన్నె సుబ్బారావు తెలిపారు. అప్లికేషన్ ఫారంతోపాటు పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫొటో, ఆధార్ కార్డు, సాధారణ ఓటరు కార్డు, డిగ్రీ లేదా డిప్లమో సర్టిఫికేట్‌ను జత చేయాలని తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఇసుకను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి

● తహసీల్దారు కార్యాలయాల వద్ద నిరసనలు

గుంటూరు(తూర్పు), అక్టోబరు 4 : దళారీ వ్యవస్థను నివారించి ప్రజలకు అందుబాటులోకి ఇసుక తీసుకురావాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఇసుక సమస్యను పరిష్కరించాలని కోరుతూ నగరంలో తూర్పు, పశ్చిమ తహసీల్దారు కార్యాలయాల వద్ద భవన నిర్మాణ కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన విధానంలో రాష్ట్రంలో ఉచిత ఇసుక అందడం లేదన్నారు. తక్షణమే ఇసుక సరఫరాలో నిర్మాణాత్మక చర్యలు చేపట్టి కార్మికులకు పని భద్రత కల్పించాలని కోరారు. ధర్నా అనంతరం తూర్పు, పశ్చిమ తహసీల్దార్లు నగేష్, వెంకటేశ్వర్లుకు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నళినికాంత్, కే.శ్రీనివాసరావు, కార్తీక్, బి.సత్యనారాయణ, ఆదినికల్సన్, షహీద్, రమణ, భాషా, సీతారామయ్య, సైదా, టి.రవి, మైలా ముత్యాలరావు, రషీద్, సారధి, మస్తాన్, బుజ్జి, రియాజ్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణ చేస్తోన్న వాహనాలు స్వాధీనం

గుంటూరు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సరైన ధ్రువపత్రాలు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తోన్న రెండు లారీలు, మూడు ట్రాక్టర్లను గుంటూరు తూర్పు మండలం రెవెన్యూ అధికారులు స్వాధీన పరుచుకొన్నారు. శుక్రవారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు నిర్వహించి వాహనాలను సీజ్ చేసి తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు నివేదించారు. ఈ నివేదికని తహసీల్దార్ పరిశీలించి లారీకి రూ.25 వేలు, ట్రాక్టర్‌కు రూ.10 వేల చొప్పున జరిమాన విధించారు.

వరద బాధితుల సహాయ నిధికి మిర్చి వ్యాపారస్థుల విరాళం

గుంటూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులోని కమీషన్ వ్యాపారస్థులు పలువురు ఒక బృందంగా ఏర్పడి రూ.9 లక్షల నగదుని వరద బాధితుల సహాయార్థం విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కి అందజేశారు. శుక్రవారం మిర్చి వ్యాపారి కర్లపూడి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొత్తూరి సుధాకర్, కొత్తూరి హర్షిత్‌కుమార్, నిమ్మగడ్డ సత్యన్నారాయణ, పోతినేని శ్రీనివాసరావులు మంత్రి లోకేశ్‌ని కలిసి విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ వారిని అభినందించారు.



మంత్రి లోకేష్‌కి విరాళం అందజేస్తున్న మిర్చియార్డు వ్యాపారస్థులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

గుంటూరు, అక్టోబరు 4 : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. అరండల్‌పేట పోలీస స్టేషన్ పరిధిలో వున్న వెంగళరావునగర్‌లోని ముస్సిపల్ కార్పొరేషన్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన వారధి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వెస్ట్ డీఎస్పీ జయరామ్, అరండల్ పేట సీఐ శ్రీనివాసరావు, స్థానికులు, అధికారులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ చర్మకార పరిశ్రమ అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన పిల్లి మాణిక్యరావును అభినందిస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు, దారపునేని నరేంద్ర, పోతినేని శ్రీనివాస్ - గుంటూరు.



మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా బెస్ట్ గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ డీజీపీ డెస్క్ అవార్డును తీసుకున్నారు. ఆయన పలు కేసుల్లో చూపిన ప్రతిభకు గుర్తింపుగా ఈ రివార్డుకు ఎంపిక చేసినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. - గుంటూరు.

చెత్త పన్ను ఎత్తివేయటం హర్షణీయం

● ఎమ్మెల్యే గళ్లా మాధవి



గుంటూరు, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి) : చెత్తపన్ను తొలగించిన సీఎం చంద్రబాబు పేదల పక్షపాతి అని రుజువు చేసుకున్నారని ఎమ్మెల్యే గళ్లా మాధవి కొనియాడారు. గుంటూరు పశ్చిమ కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చెత్త పన్ను వసూళ్లను రద్దు చేస్తామని చంద్రబాబు చెప్పారని, ఆ మాట ప్రకారం చెత్త పన్నును ఎత్తివేస్తున్నట్లు సీఎం ప్రకటించటం హర్షనీయమని ఆమె అన్నారు. చెత్తపన్ను తొలగింపుపై ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయని, ఇది పెత్తందారుడు జగన్‌రెడ్డికి చెంపపెట్టు లాంటిదని అన్నారు. చెత్త సేకరణ పేరుతో గత ప్రభుత్వం ఇళ్ల నుంచి నెలకు రూ.30 నుంచి రూ.150 చొప్పున వసూలు చేసిందని, ఇలా ఏటా రూ.200 కోట్లు పేదల ముక్కు పిండి వసూలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల కష్టాలు తెలిసిన చంద్రబాబు చెత్త పన్ను వసూలు చేయమని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ఆ హామీని నిలుపుకుని ఇది మంచి ప్రభుత్వం అని నిరూపించుకుందని మాధవి తెలిపారు.

జగన్‌రెడ్డి నాలుకకు నరం లేదు.. మాటకు విలువ లేదు : మన్నవ



గుంటూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నాలుకకు నరం లేదని, ఆయన మాటకు విలువలేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ విమర్శించారు. గుజ్జనగుండ్లలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న అంశంపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను స్వాగతిస్తున్నామని అన్నారు. సిట్‌లో ఇద్దరు సీబీఐ అధికారులు, ఇద్దరు ఏపీ పోలీస్ అధికారులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు సభ్యులుగా ఉండాలని సుప్రీం కోర్టు సూచించడంపై మోహనకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో తిరుమల కొండను అపవిత్రం చేశారని అన్నారు. తిరుమల ప్రసాదంపై రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు హెచ్చరించినా జగన్ మాత్రం పదేపదే మీడియా ముందుకు వచ్చి అబద్ధాలు చెబుతూ ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. లడ్డూ విషయంలో ఆత్మరక్షణలో పడ్డ వైసీపీ నేతలు సుప్రీం కోర్టు ఆదేశాలను సైతం తప్పుబట్టడం దుర్మార్గమన్నారు.



డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కు పుస్తకం బహుకరిస్తున్న మంగాదేవి, పక్కన పాలడుగు లక్ష్మణరావు, డాక్టర్ ఓవీ రమణ, రఘురాం తదితరులు

ఎంతోమంది వైద్య విద్యార్థులను అందించిన ఘనత మీదే

● మంగాదేవి సేవలను కొనియాడిన పెమ్మసాని

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 4 : సమాజానికి ఎంతోమంది వైద్య విద్యార్థులను అందించిన ఘనత మీకే దక్కుతుందని వెంకటేశ్వర బాల కుటీర్ వ్యవస్థాపక కార్యదర్శి మంగాదేవిని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కొనియాడారు. ఆయనను శుక్రవారం గౌరవ పూర్వకంగా మంగాదేవి కలిసి ఆమె రచించిన వామన వృక్షాలు అనే పుస్తకాన్ని అందజేశారు. డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ విద్యా రంగంలో మంగాదేవి సేవలను కొనియాడుతూ ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది సమాజానికి అందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర బాల కుటీర్ ప్రెసిడెంట్ పాలడుగు లక్ష్మణరావు, సీఏవో ఎన్ దుర్గా రఘురాం, ప్రముఖ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ ఓవీ రమణ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తదితరులు

బాస్కెట్‌బాల్ పోటీలకు సీతారామయ్య స్కూల్ విద్యార్థుల ఎంపిక

గుంటూరు(కార్పొరేషన్), అక్టోబరు 4 : రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్(సీబీఎస్ఈ) విద్యార్థులు ఎంపికైనట్టు పాఠశాల సెక్రటరీ, కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ శుక్రవారం తెలిపారు. విష్ణువర్ధన్ మాట్లాడుతూ గత నెల 30న నరసరావుపేట ముస్సిపల్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ సెలెక్షన్స్ జరిగాయని అన్నారు. ఈ సెలక్షన్స్‌లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ విద్యార్థులు అండర్-14 విభాగంలో ఎ.అభినయ, ఎ.శశి, షణ్ముఖ్, అండర్- 17 విభాగంలో బి.సుధారాణి, ఎ.అక్షయ, వి.జ్ఞాన చరిత, ఎ.నిహారిక ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఉత్తమ శిక్షణ ఇచ్చిన కోచ్ కె.రవిని, విద్యార్థులను ప్రోత్సహించిన వారి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యులు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రిన్సిపల్ జంపని పద్మజ పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

● ఎస్పీ ఆదేశాలతో రక్షించిన నగరంపాలెం పోలీసులు



రక్షించిన తల్లీ, పిల్లలతో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, అధికారులు

గుంటూరు, అక్టోబరు 4 : ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన తల్లిని ఎస్పీ ఆదేశాలతో నగరంపాలెం పోలీసులు రక్షించారు. వివరాల్లోకి వెళితే... శ్రీనివాసరావుపేట 11వ లైనుకు చెందిన షేక్ హసీనాకు తాడేపల్లికి చెందిన సుభానికి సుమారు 4 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు మగ పిల్లలు సంతానం ఉన్నారు. కొన్ని రోజుల క్రితం హసీనాకు, ఆమె భర్తకు గొడవ జరిగిన కారణంగా హసీనా తన పుట్టింటికి వచ్చి ఉంటుంది. ఆ తరువాత హసీనాపై భర్త అనుమానం పెంచుకుని ఇబ్బందులకు గురి చేస్తూ ఉన్నాడని, దానికి మనస్థాపం చెంది తన పిల్లలతో సహా చనిపోవాలనే ఉద్దేశంతో శుక్రవారం ఉదయం తాడేపల్లిలోని భర్త ఇంటివద్దకు వెళ్ళింది. అయితే భర్త ఆమెను ఇంటిలోకి రానివ్వకపోవడంతో ప్రకాశం బ్యారేజి వద్దకు బయలుదేరి వెళ్ళింది. అలా వెళ్తూ హసీనా తన పిన్నికి తాను చనిపోతున్న విషయం చెప్పింది. దీంతో ఆమె వెంటనే అదే విషయాన్ని తన అమ్మకు చెప్పింది. వెంటనే తన తల్లి సూర్జహాన్ నగరంపాలెం పోలీసు స్టేషన్ లో తెలియజేసింది. నగరం పాలెం సీఐ వీరా నాయక్ వెంటనే ఎస్పీకి తెలియజేసి కంట్రోల్ రూమ్ ద్వారా ఆ విషయాన్ని తాడేపల్లి అవుట్ పోస్ట్ పోలీసులకు తెలిపారు. వారు వెంటనే స్పందించి ఆమె ఉన్న ప్రదేశాన్ని గుర్తించి ఆమెను, పిల్లలను ప్రాణాలతో కాపాడారు. ఆమెను తల్లి సూర్జహాన్‌కి అప్పగించారు. సకాలం లో స్పందించిన అధికారులకు, కంట్రోల్ రూమ్ సిబ్బందికి, ఎస్పీకి హసీనా కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

నేడు తెనాలికి కేంద్రసహాయ మంత్రి పెమ్మసాని

తెనాలి రూరల్, అక్టోబరు 4: కేంద్ర గ్రామాణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శుక్రవారం తెనాలిలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు మునిసిపల్ కార్యాలయం, 12 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలలో జరిగే సమీక్ష సమావేశాలకు హాజరవనున్నారు. సాయంత్రం 3 గంటలకు తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో జరిగే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొననున్నారు. సాయంత్రం 6 గంటలకు నన్నపనేని వెంకట్రావు ట్రస్ట్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమానికి విచ్చేసి గ్రహీతలను సత్కరించనున్నారు. ఆయనతో పాటు రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు పాల్గొననున్నట్లు టీడీపీ, జనసేన వర్గాలు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



పార్కులో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

ప్రజల సహకారంతో స్వచ్ఛ తెనాలిని సాధిద్దాం

● పట్టణ పురపాలక సంఘ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట అక్టోబరు 4: ప్రజల సహకారంతో స్వచ్ఛ తెనాలిని సాధిద్దామని పురపాలక సంఘ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. నందులపేటలోని 6వ వార్డులో శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ శేషన్నలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛత హీ సేవ 2024లో భాగంగా పట్టణంలో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలలో ప్రజలు పాల్గొని స్వచ్ఛ్ తెనాలి, స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు సహకరించాలన్నారు. చెత్తను వ్యర్థాలను మురుగు కాలువలలో వేయరాదని పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చన్నారు. కవిరాజా పార్కులోని వ్యర్థాలను, చెత్తను తొలగించారు. వార్డు ప్రజలు పార్కులోని సమస్యలను చైర్‌పర్సన్, కమిషనర్‌లకు తెలియజేశారు. అనంతరం 28, 37వ వార్డులలో జరుగుతున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించి శానిటరీ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్వచ్ఛత హీ సేవ అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ కొర్రపాటి లక్ష్మీ శ్రీనివాస్, మున్సిపల్ అసిస్టెంటు కమిషనర్ లక్ష్మీపతిరావు, ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల, మున్సిపల్ అధికారులు, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిపనులపై ప్రత్యేక దృష్టిపెడతా

● ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలి రూరల్, అక్టోబరు 4: తెనాలి మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజలకు మంచి జరిగేలా చూస్తానని నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన అత్తోట దీప్తి అన్నారు. శుక్రవారం ఆమె మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో తాడికొండ మండలానికి ఎంపీడీవోగా బాధ్యతలు నిర్వహించిన దీప్తి సాధారణ బదిలీల్లో భాగంగా తెనాలి వచ్చారు. ఆమెను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.



బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో అత్తోట దీప్తి

నేడు నన్నపనేని వెంకట్రావు ట్రస్ట్ పురస్కారాల ప్రదానం

తెనాలి, మారీసుపేట అక్టోబరు 4: నన్నపనేని వెంకట్రావు ట్రస్ట్ పురస్కారాల ప్రదానం కార్యక్రమాన్ని శనివారం, అక్టోబరు 5వ తేదీన నిర్వహిస్తామని ట్రస్ట్ నిర్వాహకులు నన్నపనేని వెంకట్రావు తెలిపారు. స్థానిక నాజరుపేటలోని ఎన్వీఆర్ కన్వెన్షన్ హాల్‌లో శుక్రవారం నన్నపనేని వెంకట్రావు ట్రస్ట్ నిర్వాహకులు నన్నపనేని సుధాకర్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో నన్నపనేని వెంకట్రావు ఉత్తమ పురస్కారాలను గుండె వైద్యులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణ మూర్తి, అన్నమయ్య గ్రంథాలయ వ్యవస్థాపకులు లంక సూర్యనారాయణలకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర రెవెన్యూ శాఖ, స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మారోతు సీతారామయ్య, భాస్కర్, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



పంచాయతీరాజ్ ఏఈ సాంబిరెడ్డిని అభినందిస్తున్న ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు

పీఆర్ ఏఈగా సాంబిరెడ్డి బాధ్యతల స్వీకారం

కొల్లిపర, అక్టోబరు 4: కొల్లిపర మండలం పంచాయతీరాజ్ ఏఈగా అవుతు సాంబిరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు కొనసాగిన ఏఈ రవికుమార్ రిటైర్ అయ్యారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు సాంబిరెడ్డిని పుష్పగుచ్ఛంతో అభినందించారు. అదేవిధంగా పరిపాలనాధికారిగా ప్రతాప్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీగా భార్గవ్, ఏపీఎంగా రమాదేవి, సీసీలు విజయకుమార్, టి.మధులు, కొల్లిపర పంచాయతీ కార్యదర్శిగా అలకనంద, అత్తోట పంచాయతీ కార్యదర్శిగా లక్ష్మి, పిడపర్తిపాలెం పంచాయతీ మాధురి, చెముడుబాడు పంచాయతీ కార్యదర్శిగా ఉషాప్రియాంక, మున్నంగి పంచాయతీ కార్యదర్శిగా మృత్యుంజయరావు పదవీ బాధ్యతలు చేపట్టారు.

నేడు పురపాలక సంఘ అభివృద్ధిపై సమీక్ష

తెనాలి, మారీసుపేట అక్టోబరు 4: నేడు శనివారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో పురపాలక సంఘ అభివృద్ధి, స్వర్ణాంధ్ర 2047 విషయాలపై సమీక్ష నిర్వహిస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లు పాల్గొంటారని చైర్‌పర్సన్ ఒక ప్రకటనలో తెలిపారు.

బీసీ హాస్టళ్లలో డిజిటల్ రిసోర్స్ సెంటర్ల ఏర్పాటు హర్షనీయం

● బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కేసన శంకరరావు

తెనాలి, మారీసుపేట అక్టోబరు 4: బీసీ హాస్టల్స్‌లో డిజిటల్ రిసోర్స్ సెంటర్ల ఏర్పాటు హర్షనీయమని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు కేసన శంకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెనుకబడిన తరుగతుల సంకేమ వసతి గృహాలలోని విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మెరుగుపర్చడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నవంబరు 14 తేదీన బాలల దినోత్సవం పురస్కరించుకొని 104చోట్ల డిజిటల్ రిసోర్స్ సెంటర్లను ప్రారంభించాలనే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని శంకరరావు తెలిపారు. వెనుకబడిన కులాల బిడ్డల విద్యాభ్యాస సామర్థ్యాలను మెరుగుపరచడానికి హాస్టళ్ళలో డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డులను ఏర్పరచి, ప్రత్యేక ట్యూటర్లను ప్రభుత్వమే నియమించి డిజిటల్ రిసోర్స్ సెంటర్ల నిర్మాణానికి పూనుకోవడం ద్వారా బీసీ సమాజ సాధికారితకు ఎంతగానో దోహదమవుతుందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 747 ప్రీమెట్రిక్ బీసీ సంక్షేమ వసతి గృహాలలో 545చోట్ల మాత్రమే సొంత భవనాలు ఉన్నాయని మిగతా 202చోట్ల కూడా ప్రభుత్వ భవనాలను నిర్మించాలని కోరారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న బీసీ విద్యార్థుల దామాషా ప్రకారం మరో 200 కొత్త బీసీ హాస్టల్ భవనాల నిర్మాణం జరగాలని కోరారు.

ఆసక్తితో విద్యను అభ్యసిస్తే లక్ష్యాలు సులభం: కొల్లా

పొన్నూరు టౌన్, అక్టోబరు 4: ఆసక్తితో విద్యను అభ్యసిస్తే ఎంత పెద్ద లక్ష్యమైనా సులభంగా అందుకోవచ్చని ఇంపాక్ట్ మోటివేషన్ స్పీకర్ కొల్లా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక నిడుబ్రోలు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బేసిక్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ కార్యక్రమం జరిగింది. కొల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన జీవనం సాగించాలని సూచించారు. విద్యార్థులు లక్ష్య నిర్దేశం చేసుకుని ఉన్నత శిఖరాలను ఎదగాలని సూచించారు. చిన్ననాటి నుంచే లక్ష్యాలను నిర్దేశించుకోవటం ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు డాక్టర్ రవి రాకేష్‌దేవ్, ఎన్ నన్నపనేని బాలకృష్ణ, పాములపాటి రవీంద్రనాథ్, ఎస్ మేఘనాథ్, కె రామకృష్ణ, శివరామకృష్ణ, జీఎంఎస్ గుప్తా, శ్రీనివాస్, బి రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు

తెనాలి, మారీసుపేట అక్టోబరు 4 దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. స్థానిక గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం సాలిగ్రామ మఠం ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో రెండవ రోజు శుక్రవారం అమ్మవారు హంస గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా అమ్మవారిని జిలేబిలతో అలంకరించారు. మహిళ భక్తులచే సామూహిక లలిత సహస్ర నామ పారాయణం, రామలింగేశ్వర భజన మండలి వారు సౌందర్యలహరి పారాయణం చేశారు.

● తెనాలి, మారీసుపేట: స్థానిక బోసురోడ్డులోని కన్యాకపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ధనలక్ష్మిగా అలంకరించారు. దేవి చౌక్‌లోని రాజరాజేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మిగా పూజలందుకున్నారు. మారీసుపేటలోని బాల త్రిపుర సుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామివారి దేవస్థానంలో శ్రీ బాల త్రిపుర సుందరి దేవికి ధనలక్ష్మీగా అలంకరణ చేశారు. నందివెలుగులోని కనక దుర్గా పార్వతి సమేత అఘస్త్యేశ్వర స్వామివారి దేవస్థానంలో ధనలక్ష్మీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు.

● పొన్నూరు టౌన్: జీబీసీ రోడ్డులోని కనకదుర్గాభవానీ అమ్మవారు బ్రహ్మచారిణి దేవీగా పూజలందుకుంది. కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అమ్మవారు పంచముఖ గాయత్రీ దేవిగా అలంకరించారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి కాశీ అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చింది. ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు జరిగాయి. చేబ్రోలు మండలంలోని శలపాడులో నవ రాత్రి మండపంలోని అమ్మవారు గాయత్రీదేవిగా పూజలందుకున్నారు.

● కొల్లిపర: మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత జనార్ధనస్వామి దేవస్థానంలో శ్రీవారాహీదేవి, శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ ముక్తేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీగాయత్రిదేవి, శ్రీ షిర్డీసాయిబాబా మందిరంలో శ్రీసంతానలక్ష్మిదేవిగా అలంకరించారు.

● పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో గజలక్ష్మి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

● పెదకాకాని: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం పెదకాకాని భ్రమరాంబ అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాన్ని పూర్తిగా విద్యుత్ కాంతులతో అలంకరించారు. ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, మల్లేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఆలయాన్ని వేల సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు జరిపిస్తున్నారు.





దశావతార వెంకటేశ్వరస్వామి ఆలయంలో గజలక్ష్మిగా మహాలక్ష్మి అమ్మవారు, గాయత్రీదేవిగా పెదకాకాని భ్రమరాంబ అమ్మవారు





కొల్లిపర శివాలయంలో శ్రీగాయత్రిదేవిగా, శ్రీజనార్ధనస్వామి ఆలయంలో శ్రీవారాహీదేవిగా అమ్మవారు



తెనాలి శ్రీవిద్యాపీఠంలో జిలేబిల అలంకరణతో హంస గాయత్రి దేవిగా అమ్మవారు



ధనలక్ష్మీ అలంకారంలో తెనాలి శ్రీవాసవి కన్యాక పరమేశ్వరి



పొన్నూరులో గాయత్రీ దేవిగా కాశీవిశాలాక్షమ్మ

కార్మికులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్



సబ్‌కలెక్టర్ సంజనాసిన్హాకు వినతి పత్రం అందిస్తున్న బాబుప్రసాద్ తదితరులు

తెనాలి రూరల్, అక్టోబరు 4: భవన నిర్మాణరంగ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలని సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబుప్రసాద్ అన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం ఇసుకను అందుబాటులోకి తీసుకోరావాలని కోరుతూ భవన నిర్మాణ రంగ కార్మికులతో కలిసి తెనాలిలో ర్యాలీ నిర్వహించి సబ్‌కలెక్టర్ సంజనా సిన్హాను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాబుప్రసాద్ మాట్లాడుతూ ఇసుకను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. దీనివలన భవన నిర్మాణరంగకార్మికులకు, వాటి అనుబంధ నిర్మాణ రంగ కార్మికులకు ఉపాధి కలుగుతుందన్నారు. భవన నిర్మాణ కార్మికుల కోసం 1996లో పార్లమెంట్ చేసిన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. తాపీ కార్మిక సంఘం తెనాలి డివిజన్ కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ 13రకాల కార్మికులకు ఉపాధి అవకాశాలు ఒక్క ఇసుకతోనే కలుగుతాయన్నారు. ఇసుక పుష్కలంగా దొరికితే నిర్మాణ పనులు ఎక్కువగా చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. ఇసుక కొరతతో నిర్మాణపనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడంతో కార్మికులకు ఉపాధి అవకాశాలు లేక అప్పులు చేసే పరిస్థితి నెలకొందని ఆరోపించారు. ప్రభుత్వం ఇసుకను నిరంతం అందుబాటులో ఉంచేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్‌హుస్సేన్‌వలి, ఎస్‌కే ఫకీర్‌అహ్మద్, భూపతి కృష్ణయ్య, ఆనం దుర్గారావు, రెడ్డిసాయికుమార్, ఎస్‌కే జహలుద్దీన్, శెట్టి యేసోబు, అబ్రహం, వెంకట్, దాసు, యేసుపాదం, ఎస్‌కే జహరుద్దీన్, అంకమ్మ, ఎమ్.వెంకటేశ్వర్లు, ఎన్.రాజ్యలక్ష్మి, వై.ఈశ్వరి పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, చేబ్రోలు అక్టోబరు 4: ఉచిత ఇసుక హామీని సులభతరంగా తక్షణమే అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండా లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం చేబ్రోలు, పొన్నూరు మండలాల్లో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తున్నా నేటికి ఉచిత ఇసుక ప్రజలకు అందటం లేదన్నారు. రాజధాని నిర్మాణ పనుల్లో స్థానికులకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు, చంద్రన్న బీమా పథకాన్ని ప్రతి ఒక్కరికి అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నిరసన ప్రదర్శనలో సీపీఎం నాయకులు హనుమంతరావు, మస్తాన్ వలీ, చింతల శ్రీను, నిమ్మకూరి రమేష్ బాబు, దుర్గయ్య, ప్రసాద్, వాసుబాబు, పవన్ కుమార్, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.



చేబ్రోలు తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పెదకాకానిలో...

పెదకాకాని, అక్టోబరు 4: ఇసుక విషయంలో అవినీతిని అరికట్టి, అందరికీ అందుబాటులోకి తేవాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వై.నేతాజీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు పెదకాకాని తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నా కార్యక్రమంలో నేతాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో 30లక్షల మంది భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలకు ఇసుక కొరత వల్ల జీవనం అస్తవ్యస్తమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు అవుతున్నా భవన నిర్మాణ కార్మికులకు పనిలేని పరిస్థితి ఏర్పడిందని, సంక్షేమ బోర్డు నుంచి వారికి ఆర్థికసాయం అందజేసి వారిని ఆదుకోవాలని నేతాజీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ గత ప్రభుత్వం తెచ్చిన జీవోలను రద్దుచేసి సంక్షేమ బోర్డును కొనసాగించాలని, నిలిపిన క్లెయిములు, పెండింగ్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.సత్యనారాయణ, యు.శివయ్య, ఏ నాగేశ్వరావు, సీహెచ్ రామకృష్ణ, జెట్టి రాజ్యలక్ష్మి, బొజ్జ విజయలక్ష్మి, కే హనుమకుమారి, ఏసుపాదం, ఎస్.స్వామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

భారీవర్షాలకు నష్టపోయిన రైతులకు న్యాయం చేయండి

● డిప్యూటీ తహసీల్దార్‌కు రైతుసంఘాల వినతి

తెనాలి రూరల్, అక్టోబరు 4: ఈ క్రాప్ నమోదుతో సంబంధం లేకుండా భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులందరికీ పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వం అందించే నష్టపరిహారం పూర్తిస్థాయిలో రైతులకు అందలేదంటూ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పంటల సాగు చేపట్టిన అనేకమంది కౌలు రైతులకు ఈ క్రాప్ నమోదు కాకపోవడంతో నష్టపరిహారం అందలేదని ఆరోపించారు. అంతేకాకుండా పలువురు కౌలుకు సాగుకు చేస్తున్న రైతులకు భూ యజమాని సహకరించకపోవడంతో పరిహారం సాగురైతులకు అందలేదన్నారు. ఎకరాకు వరికి రూ.30వేలు వరకూ ఖర్చు చేస్తే ప్రభుత్వం మాత్రం రూ.8-10వేలు మాత్రమే వేసి, వాణిజ్యపంటలకు రూ.50వేలు నుంచి 1లక్ష వరకూ ఖర్చు చేస్తే వారికి రూ.14వేలు మాత్రమే తూతూమంత్రంగా జమచేసి చేతులు దులుపుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ క్రాప్, భూ యజమానితో సంబంధంలేకుండా వాస్తవ సాగుదారుల వివరాలు నమోదు చేసుకుని నష్టపరిహారం అందించాలన్నారు. వరికి రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.50వేలు నుంచి 1లక్ష వరకూ పరిహారం అందించాలని, అన్నదాత సుఖీభవ ద్వారా పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నష్టపోయిన ప్రతి రైతులకు పరిహారం అందించకుంటే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నెల 8న విజయవాడలో జరిగే సదస్సుకు కౌలు రైతులందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తొలుత తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు.

కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరరావు, వేజెండ్ల తబిత, నేలపాడు సర్పంచ్ సోమవరపు నాగమల్లేశ్వరరావు, తాడిబోయిన వెంకటేశ్వరరావు, పిరాటి అప్పారావు, నన్నపనేని సురేష్‌బాబు, బొడ్డు రత్నకిషోర్, కంచర్ల శివపద్మారావు, అండె గోపినాథ్, తెనాలి నిర్మల, టి.శాంతకుమార్, బడుగు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతు సంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి తదితరులు



పాపయ్యకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ దంపతులు

మృతుడికి ఎమ్మెల్యే నివాళి

పొన్నూరు టౌన్, అక్టోబరు 4: మండల పరిధిలోని చింతలపూడి పాల సొసైటీ పాలకవర్గ సభ్యుడు ధూళిపాళ్ళ పాపయ్య గురువారం మృతిచెందారు. శుక్రవారం ఉదయం పాపయ్య మృతదేహాన్ని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, డీవీసీ హాస్పటల్ ఎండీ ధూళిపాళ్ళ జ్యోతిర్మయి తదితరులు సందర్శించి పూలమాలలువేసి నివాళి అర్పించారు. పాపయ్య మృతికి తెలుగుదేశం పార్టీ నాయకులు, పాల ఉత్పత్తిదారులు నివాళి అర్పించారు.



పార్క్‌లలో వసతుల గురించి ఆరా తీస్తున్న కమిషనర్ రమేష్ బాబు

పార్క్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

● మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు

పొన్నూరు టౌన్, అక్టోబరు 4: పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని పార్కుల్లో ప్రజలకు ఆహ్లాదం కలిగించేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు తెలిపారు. పట్టణంలోని పాతపొన్నూరు, అంబేద్కర్ పార్క్‌ను శుక్రవారం కమిషనర్ పరిశీలించారు. పార్క్‌లో పచ్చదనం కనిపించకపోవటం, చిన్నారుల ఆటవస్తువులు పాడైపోవటాన్ని గమనించారు. స్థానికులను కలుసుకుని పార్క్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పార్క్‌లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తక్షణం పాడైపోయిన ఆట వస్తువుల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయటానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్‌తో పాటు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నూరు ఎంపీడీవోగా చంద్రశేఖరరావు బాధ్యతల స్వీకారం

పొన్నూరు టౌన్, అక్టోబరు 4: పొన్నూరు ఎంపీడీవోగా చంద్రశేఖరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. చంద్రశేఖరరావు బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండటం నుంచి పొన్నూరు బదిలీపై వచ్చారు బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో చంద్రశేఖరరావును కార్యాలయ అధికారులు, సహచర సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.



ఎంపీడీవో చంద్రశేఖర్ రావు

వృద్ధురాలికి కొలకలూరులో అంతిమ సంస్కారం

● సమాధి చేసేందుకు ఖాజీపేట హిందూ శ్మశానంలో అడ్డగింత

తెనాలి రూరల్, అక్టోబరు 4: మండలంలోని ఖాజీపేటలో మృతిచెందిన ఓ వృద్ధురాలిని కొలకలూరు క్రిస్టియన్ శ్మశాన వాటికలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం ఖాజీపేటలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారిలో సుమారు 100 కుటుంబాలు మరో మతంలోకి మారారు. వారి ఆచారాలకు అనుగుణంగా శ్మశాన వాటిక లేకపోవడంతో హిందూ శ్మశాన వాటికలోనే ఖననం చేయటం పరిపాటి. అయితే మతం మారిన వారిని హిందూ శ్మశాన వాటికకు తీసుకువచ్చేందుకు మిగిలిన గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా హిందూ శ్మశాన వాటిక స్థలం తక్కువగా ఉండటంతో అక్కడ ఖననం చేసి సమాధులు నిర్మిస్తుండటంతో స్థలం చాలదన్న ఉద్దేశంతో మతం మార్చుకున్నవారిని ఖననం చేసేందుకు అనుమతించడంలేదు. ఇది వివాదానికి దారితీస్తోంది. దీనిపై గ్రామంలో ఘర్షణ జరిగే అవకాశం ఉండటంతో రూరల్ పోలీసులు గ్రామానికి చేరి శాంతియుత వాతావరణంలో అంతిమసంస్కారాలు జరిగేలా చర్యలు చేపట్టారు.

మండల పరిషత్ పాలనాధికారిగా శ్రీనివాసరావు

తెనాలి రూరల్, అక్టోబరు 4: తెనాలి మండల పరిషత్ పరిపాలనాధికారి (ఏవో)గా ఆచంట శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రేపల్లె మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా తెనాలి వచ్చారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.



రేషన్ బియ్యం అక్రమ నిల్వ పట్టివేత

తెనాలి రూరల్, అక్టోబరు 4: అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని రూరల్ పోలీసులు, సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించి సీజ్ చేశారు. మండలంలోని బుర్రిపాలెంలో ఓ స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో సోదాలు జరపగా సుమారు 80బస్తాలు (ఒక్కోబస్తా 50కేజీలు) రేషన్ బియ్యం నిల్వలను గుర్తించి సీజ్‌చేసి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

తెనాలి, మారీసుపేట అక్టోబరు 4: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. శుక్రవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుల్తానాబాదుకు చెందిన ధనావత్ హేమలిబాయి (80) తన పనుల నిమిత్తం చెంచుపేటకు వస్తున్న సమయంలో క్రేన్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. గాయపడిన ఆమెను స్థానికులు జిల్లా వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్య సేవల కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నటు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

తెనాలి, మారీసుపేట అక్టోబరు 4: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. శుక్రవారం త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక మారీసుపేటకు చెందిన డోగిపర్తి శివశంకర్ ఓవర్ బ్రిడ్జిపై రోడ్డు దాటే క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. అతని భౌతికకాయాన్ని జిల్లా వైద్యశాలలోని మార్చురీకి తరలించామన్నారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

సీఆర్‌డీఏ గ్రీవెన్స్‌కు సమస్యల వెల్లువ

తుళ్లూరు, అక్టోబరు 4: సీఆర్‌డీఏ గ్రీవెన్స్‌కు రైతుల సమస్యలు వెల్లువెత్తాయి. ప్రతి శుక్రవారం తుళ్లూరు సీఆర్‌డీఏ కార్యాలయంలో అదనపు కమిషనర్ రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ సమస్యలు, గ్రామ కంఠాల సమస్యలు విస్తీర్ణ సమస్యలు, జరీబు పరిగణించకుండా మెట్టగా చూపించి కౌలు తగ్గించటం, కౌల్లు కొంత మందికి పడకపోవటం, ఎండోమెంట్ రైతు మధ్య ఉన్న వివాదం తదితర సమస్యలు శుక్రవారం గ్రీవెన్స్‌లో అదనపు కమిషనర్ సూర్య సాయి ప్రవీణ్ చంద్ పరిశీలించారు. రైతుల సమస్యల పట్ల వెంటనే స్పందిస్తామని అదనపు కమిషనర్ ఈ సందర్భంగా అన్నారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌లలో జాప్యం లేకుండా రిజిస్ట్రార్ ఆఫీసులు పెంచుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశ్వేశర నాయుడు, సోషల్ వెల్ఫేర్ గ్రూపు డైరెక్టర్ కృష్ణమోహన్, సోషల్ వెల్ఫేర్ డిడి బొర్రా శ్రీనివాసరావు, ఆ,యా యూనిట్ డీసీ లు పాల్గొన్నారు.